
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024



ఆశల చిగురు



ఇటీవల కురిసిన వర్షాలకు మెట్ట పంటలు జీవం పోసుకున్నాయి. రైతులు విత్తనాలు వేసిన తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో మొలకలన్నీ దుక్కిలోనే ఎండి పోయాయి. దీంతో వేలాది రూపాయలు అప్పు తెచ్చి విత్తనాలు వేసిన రైతులకు భయం పట్టుకుంది. ఈ తరుణంలో కురిసిన వర్షాలకు మాడిన మొలకలన్నీ పచ్చబడి ఏపుగా పెరగడంతో రైతుల్లో ఆశలు రేకెత్తాయి. ఇప్పుడు పంట పొలాలన్నీ పచ్చగా మారి అందంగా కనిపిస్తున్నాయి. ఈ పంటలు చేతి కందే వరకు ఇలాగే ఉండాలని, మధ్యలో అవాంతరాలు ఎదురు కాకుండా ఉండాలని రైతులు కోరుకుంటున్నారు.

- యాచారం, ఆగస్టు 4

బోనమెత్తిన ఆదిభట్ల



ఊర పోచమ్మ బోనాల సందర్భంగా ఆదివారం ఆదిభట్లలో ఇంటింటా పండుగ వాతావరణం కనిపించింది. శనివారం కాటమయ్య బోనాలు కాగా, ఆదివారం పోచమ్మ బోనాల జాతరతో రెండు రోజులుగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పచ్చని తోరణాల నడుమ విద్యుత్‌దీపాల అలంకరణలో ఆలయాలు కళకళలాడుతున్నాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఆదివారం సెలవు కావడంతో ఐటీ ఉద్యోగులు వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులతో రోడ్లన్నీ కిక్కిరిశాయి.

ఆదిభట్ల, ఆగస్టు 4



దర్గాకు వెళ్తూ అనంత లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం
- ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొన్న యాక్టివా



బస్సు ముందుభాగంలోకి చొచ్చుకెళ్లిన యాక్టివా

నందిగామ, ఆగస్టు 4: ఇద్దరు కుమారులతో కలిసి ఓ తల్లి దర్గాకు వెళుతుండగా బస్సు రూపంలో మృత్యువు వెంటాడింది. ముగ్గురూ కలిసి యాక్టివాపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొనడంతో తల్లితో పాటు పెద్ద కుమారుడు దుర్మరణం చెందారు. చిన్న కుమారుడికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాకలిగుట్ట తండా సమీపంలోని జహంగీర్‌పీర్ దర్గా రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాకు చెందిన హజీరాబేగం(36) ఇద్దరు కుమారులతో కలిసి ఆదివారం ద్విచక్రవాహనం(యాక్టివా)పై హైదరాబాద్ నుంచి రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని జహంగీర్ పీర్ దర్గాకు బయలుదేరింది. మార్గమధ్యలో చాకలిగుట్ట తండా సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును యాక్టివాతో ఢీకొట్టింది. దాంతో హజీరాబేగంతో పాటు ఆమె పెద్ద కుమారుడు అబ్దుల్ రహమాన్(12) అక్కడికక్కడే మృతిచెందారు. చిన్న కుమారుడు అబ్దుల్ రహీమ్‌కు తీవ్రగాయాలయ్యాయి. హైదబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. హజీరాబేగం భర్త దుబాయ్‌లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు.



నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

- నిధుల్లేక అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- చొరవ చూపని ప్రజాప్రతినిధులు, అధికారులు

7

ఆమనగల్లు మండలంలో అభివృద్ధి పనుల తీరు అస్తవ్యస్తంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఆడంబరంగా ప్రారంభించిన పనులు.. నేడు నిధుల కొరతతో 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అక్కడక్కడా శిలాఫలకాలు వెక్కిరిస్తున్న తీరుపై కథనం.

-ఆమనగల్లు, ఆగస్టు 4

వసూలు చేసిన పన్నులు పక్కదారి పట్టాయి. బిల్ కలెక్టర్లు చేతివాటాన్ని ప్రదర్శించారు. కొడంగల్ మున్సిపాలిటీ, గడ్డిఅన్నారం, ధారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీల లెక్కల్లో అంతా డొల్లే. నగదు పుస్తకాలకు, బ్యాంక్ ఖాతాలకు సంబంధమే లేదు. ఓ చోట రూ.లక్షల్లో తేడా ఉంటే మరోచోట రూ.కోట్ల వివరాలు మాయమయ్యాయి. 'రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై 'కాగ్' ఇచ్చిన నివేదికలో ఈ లెక్కల్లోని మాయాజాలం వెలుగులోకి వచ్చింది. దుర్వినియోగమైన సొమ్మును వడ్డీతో సహా వసూలు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాగ్ చెప్పడంతో ఎవరికి వారు భుజాలు తడుముకుంటున్నారు.



లెక్కల్లో మాయాజాలం!

- కొడంగల్ బల్దియాలో రూ.5.51లక్షలు మాయం
- వికారాబాద్ ఏఎంసీలో రూ.1.12లక్షలు దర్వినియోగం
- గడ్డిఅన్నారం మార్కెట్‌లో భారీగా అవకతవకలు
- నగదు పుస్తకాలు, బ్యాంకు ఖాతాల మధ్య వ్యత్యాసం
- జిల్లాల్లో గ్రంథాలయ పన్నుల వసూళ్లలోనూ తేడాలు
- అవకతవకలను బట్టబయలు చేసిన 'కాగ్'

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కొడంగల్ మున్సిపాలిటీలో బిల్‌కలెక్టర్లు వసూలు చేసిన పన్నుల సొమ్ము పెద్దమొత్తంలో పక్కదారి పట్టింది. అలాగే గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో నగదు పుస్తకాలకు, బ్యాంకు ఖాతాలకు అసలు పోలికే లేదు. ఏకంగా రూ.9.27 కోట్లు వ్యత్యాసం కనిపించింది.

గడ్డిఅన్నారం మార్కెట్‌లో రూ.9.27 కోట్ల వ్యత్యాసం

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌లో 2019-20 ఆర్థిక సంవత్సరంలో భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. మార్కెట్ కమిటీ ముగింపు నిల్వ- ప్రారంభ నిల్వల మధ్య భారీగా తేడాలు కనిపించాయి. అలాగే బ్యాంకు, ట్రెజరీ లెక్కల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు తేల్చారు. అలాగే క్యాష్ బుక్, పాస్ బుక్‌ల నిల్వల మధ్య కూడా భారీగా వ్యత్యాసాలను గుర్తించారు. ఇక్కడ నగదు పుస్తకం బ్యాంకు ఆఫ్ బరోడాలోని నగదు నిల్వల మధ్య రూ.9.27కోట్ల వ్యత్యాసం కనిపించింది. అలాగే బ్యాంకుల్లో ఉన్న మొత్తాన్ని సకాలంలో ట్రెజరీలో జమచేయడం లేదని దీని వల్ల నిధులు దుర్వినియోగమయ్యే అవకాశాలు ఉన్నట్లు కాగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

పన్నులు పక్కదారి

CAG

ధారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సేకరించిన నగదు ట్రెజరీలోనే జమ కాలేదు. తాజాగా 2019 నుంచి 2023 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 'రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్)' ఇచ్చిన నివేదికను ప్రభుత్వం శుక్రవారం శాసన సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వివిధ ప్రభుత్వశాఖల్లో జరిగిన అవకతకలను బట్టబయలే చేసిన కాగ్ కొన్నిశాఖల తీరును తీవ్రంగా ఆక్షేపించింది. దుర్వినియోగమైన నిధులను తక్షణమే వడ్డీతో సహా రాబట్టి ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

కొడంగల్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్ల చేతివాటం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ మున్సిపాలిటీలో బిల్‌కలెక్టర్ల మాయాజలం బయటపడింది. 2020-21 సంవత్సరానికి సంబంధించి రోజువారీ రసీదులు, రోజువారీ కలెక్షన్ రిజిస్టర్ పట్టికలు ఇతర రికార్డులను పరిశీలిస్తే అవకతవకలు బయటపడ్డాయి. మున్సిపాలిటీలో రోజువారీ సేకరించిన పన్ను మొత్తాలు ఖాతాలోకి కాకుండా సాధారణ నిధులకు జమ చేసినట్లు చూపించారు. కానీ సేకరించిన మొత్తాన్ని ఖాతాలో జమ చేయలేదు, చెల్లించలేదు. మున్సిపాలిటీలో ఆ ఏడాది మొత్తం రూ.35,61,873లు సేకరించగా ఇందులో 30,10,622 మాత్రమే జమ చేశారు. మిగతా రూ.5,51,251 జమ కాలేదు. దీనికి బాధ్యులైన బిల్‌కలెక్టర్లు నుంచి జరిమానా, వడ్డీ వసూలు చేసి జనరల్ ఫండ్‌కు జమ చేయాలని కాగ్ సిఫారసు చేసింది.

బాధ్యులపై చర్యలు తప్పనిసరి

వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సేకరించిన మొత్తం ట్రెజరీలో సర్దుబాటు చేయలేదు. ఆడిట్ పరిశీలనకు చలాన్ కాపీలు జతరపరచలేదు. ఇక్కడ రూ.1,12,157 నిధులు దుర్వినియోగమైనట్లు కనుగొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, జరిమానా వేసి వడ్డీతో రాబట్టాలని కాగ్ సూచించింది. అలాగే ధారూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సేకరించిన నగదును ట్రెజరీకి జమ చేయలేదు. నగదు పుస్తకంతో పాటు, చలాన్‌లు, ట్రెజరీ పాస్‌బుక్‌ల పరిశీలించగా రూ.60,106 దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ఈ మొత్తాన్ని రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని రికవరీ సొత్తును కమిటీ ఫండ్‌లో జమ చేయాలని ప్రభుత్వానికి కాగ్ సిఫారసు చేసింది.

పన్నుల వసూళ్లలో తేడాలు

కాగా, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదాయాల్లో గ్రంథాలయ పన్నువాటలో జిల్లాల మధ్య విపరీతమైన తేడాలు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో గ్రంథాలయ పన్నులు 94.80 శాతం వసూలు కాగా, వికారాబాద్ జిల్లాలో అత్యల్పంగా వసూలు ఉంది. ఇక్కడ కేవలం 6.57 శాతం మాత్రమే వసూలైంది. దీనిపై అధ్యాయం చేసి ఒకే విధమైన ఫలితాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కాగ్ సూచించిది.

గ్రంథాలయ పన్ను వసూళ్ల వివరాలు

జిల్లా	రావాల్సిన ఆదాయం	వచ్చిన ఆదాయం	శాతం
రంగారెడ్డి	రూ.17.81కోట్లు	రూ.16.88కోట్లు	94.80
మేడ్చల్	రూ.17.20కోట్లు	రూ.12.46కోట్లు	72.45
వికారాబాద్	రూ.3.04కోట్లు	రూ.0.20 కోట్లు	6.57

అంతా శుభమే!

నేటి నుంచి శ్రావణం షురూ

- 8 నుంచి 31 వరకు సుముహూర్తాలు
- శుభకార్యాలకు ముమ్మరంగా ఏర్పాట్లు
- మోగనున్న పెళ్లి బాజాలు
- కల్యాణ మండపాలు, అనుబంధ రంగాలకు పెరిగిన డిమాండ్



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): మూఢంతో మూడు నెలలు నిలిచిన శుభకార్యాలు నేటి నుంచి (సోమవారం) నుంచి మళ్లీ షురూ కానున్నాయి. 5వతేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభంకానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వివాహాది కార్యక్రమాలు జోరందుకోనున్నాయి. ఈ మూడు నెలలు ఎటువంటి కార్యక్రమాలు లేక వాటిపై ఆధారపడే వృత్తిదారులు, వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. మండపాలు ముస్తాబు చేసేవారు మొదలుకుని పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, ఈవెంట్ల నిర్వాహకులు, వస్త్ర దుకాణాలు, కిరాణాలు, పూలు, పండ్ల వ్యాపారులు, ప్రింటింగ్ ప్రెస్, నగల దుకాణాల యజమానులు, క్యాటర్లు వంటి వాటికి గటి దెబ్బ తగిలింది. శ్రావణం ప్రారంభంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంచి ముహూర్తాలివే..

శ్రావణం సెప్టెంబర్ 3వ తేదీతో ముగుస్తుంది. కానీ.. అమావాస్య ముందు అంటే ఈనెల 31 వరకే కార్యక్రమాలను ముగించుకోవాలని పండితులు చెబుతున్నారు. 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28, 30 తేదీల్లో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. శంకుస్థాపనలు, గృహ ప్రవేశాలకు ఇప్పటికే చాలా మంది అనువైన ముహూర్తాలను నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

పూజలు.. పండగలు

8న నాగుల చవితి, 9న నాగుల పంచమి, 16న వరలక్ష్మీవ్రతం, 19న రాఖీ పౌర్ణమి, 27న కృష్ణాష్టమి ఉన్నాయి. 5, 12, 19, 26 సెప్టెంబర్ 2 తేదీల్లో శ్రావణ సోమవారాలు, 9, 16, 23, 30 తేదీలలో శుక్రవారాలు, 10, 17, 24, 31 తేదీల్లో శనివారాలు ఉన్నాయి. ఈ రోజుల్లో పూజలు, కార్యక్రమాలతో ప్రజలు బిజీగా ఉండే అవకాశం ఉంది.

సందడే.. సందడి

ఈ నెల రోజుల పాటు ఎటు చూసినా సందడి వాతావరణమే నెలకొననుంది. ఇప్పటికే పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వారు నిశ్చయ తాంబులాలు మార్చుకొని వివాహానికి సిద్ధమవుతున్నారు. వివాహాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో కల్యాణ మండపాల దగ్గర నుంచి అనుబంధ రంగాలకు భారీగా డిమాండ్ పెరిగింది. ఏ ఫక్షన్‌హాల్ చూసినా ముందస్తు బుకింగ్‌లే కనిపిస్తున్నాయి.

31 వరకు మంచి రోజులే



శ్రావణ మాసంలో ఆగస్టు 8 నుంచి 31 వరకు నాలుగైదు రోజులు మినహా దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబర్‌లో మళ్లీ బాద్రపద మాసం శూన్యమాసం కావడంతో వివాహ ముహూర్తాలు ఉండవు.

-శ్రీపాదచారి, చేవెళ్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి

నాలుగు పెళ్లిళ్లు ఇప్పటికే బుకింగ్



మూఢంతో మూడు నెలల పాటు ఖాళీగా ఉన్నాం. శ్రావణ మాసం సందర్భంగా ఈనెల 8 నుంచి 31 వరకు పెళ్లిళ్లు ఉన్నాయి. ఇప్పటికే నాలుగైదు పెళ్లిళ్లు బుక్కయ్యాయి. ఈ నెల రోజులు చేతి నిండా పని దొరకుతుంది. నేను ఉపాధి పొందడంతో పాటు మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నాను.

-సన్నీ, సువర్ణ ఈవెంట్ మేనేజ్‌మెంట్ చైర్మన్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం

- ముమ్మరంగా సాగుతున్న కొత్తూర్ ప్రధాన రోడ్డు పనులు
- నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామంటున్న అధికారులు
- ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

రోడ్డు పనులు చకచకా



వేగంగా సాగుతున్న కొత్తూర్ ప్రధాన రోడ్డు పనులు

కొత్తూర్, ఆగస్టు 4: కొత్తూర్ వై జంక్షన్ నుంచి జ్యోతిరావు ఫూలే చౌరస్తా వరకు నిర్మిస్తున్న నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనులు చక చకా సాగుతున్నాయి. ఎన్నో ఎళ్లుగా ఈ రహదారి గోతులమయంగా మారడంతో వాహన చోదకులు, ప్రజలు నరకయాతన అనుభవిస్తూ వస్తున్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంబంధిత శాఖ అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించి, సమీక్ష నిర్వహించారు. ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. దీంతో కాంట్రాక్టర్ వారం రోజల క్రితం రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. నాలుగు లేన్ల రహదారితో పాటు సెంట్రల్ లైటింగ్‌తో రోడ్డు నిర్మాణం రూపు దిద్దుకోనుంది. రోడ్డుకు అటు 29ఫీట్లు, ఇటు 29ఫీట్లతో పాటు 6 ఫీట్ల డివైడర్ నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు డిజైన్ రూపొందించారు. 330 ఫీట్ల పొడవుతో నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. కొత్తూర్-షాద్‌నగర్ నాలుగు లేన్ల రహదారి విస్తరణలో భాగంగా గతంలో వదిలేసిన కొత్తూర్ రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నుంచి కొత్తూర్ పారిశ్రామికవాడ వరకు ఉన్న 700వందల ఫీట్ల రహదారి నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. ఫూలే విగ్రహ చౌరస్తా వద్ద భారీ జంక్షన్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు డిజైన్ చేస్తున్నారు. పెంజర్ల రోడ్డు, జేపీ దర్గా రోడ్డు, పాత గ్రామపంచాయతీ రోడ్డులో వాహనాలు మళ్లేందుకు ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రత్యేక డిజైన్ రూపొందిస్తున్నారు. నెల రోజుల్లో రోడ్డు నిర్మాణ పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ మంచిరేవుల రాజశేఖర్ తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో రోడ్డు పనులు చకచకా సాగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు నెల రోజుల్లో రోడ్డు సమస్య పరిష్కారం కానుండడంతో ఉపశమనం కలగనుంది.

నేటి నుంచి శ్రీ భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞం

తాండూరు, ఆగస్టు 4: తాండూరు శ్రీ గీతా సత్సంగ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు శ్రీ భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 4: బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు సాంకేతిక, వృత్తి, కమ్యూనికేషన్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఛైర్మన్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కమ్యూనికేషన్, వృత్తి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీలో అన్ని రకాల మౌలికసదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కష్టపడి చదివి, తల్లిదండ్రుల, ఈ ప్రాంతం పేరు ప్రతిష్టలను కీర్తింపజేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో సూర్యదేవర నీలిమా, యూనివర్సిటీ చాన్సలర్ యుబీ దేశాయ్, వైస్ చాన్సలర్ అర్చన, రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

కొడంగల్, ఆగస్టు 4: ఈ నెల 6, 7 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోని బీసీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ధర్నాలో కొడంగల్ నియోజకవర్గంలోని బీసీ సోదరులు తరలిరావాలని కోరారు.

ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన పనులు చేయించాలి

● రోడ్డు నిర్మాణానికి రూ.1.70 కోట్లు మంజూరు చేయండి


● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తోటకూర వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, ఆగస్టు 4: ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపల్ ఛైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం సీపీఆర్‌ఐ నుంచి ఉప్పల్ రింగురోడ్డు వరకు నిర్మిస్తున్న ఎలివేటర్ కారిడార్ పనులను పరిశీలించడానికి వస్తున్న మంత్రిని ఘట్‌కేసర్‌లోని అవుటర్ టోల్‌ప్లాజా వద్ద కలిసి వినతి పత్రం అందజేశారు. ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. ప్రధానంగా వంతెన పనుల కారణంగా ట్రాఫిక్‌ను స్థానిక నారాయణ గార్డెన్ మీదుగా ఎదులాబాద్ రోడ్డులోని భూగర్భ వంతెన వరకు మళ్లించినట్లు తెలిపారు. ఈరోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈరోడ్డు నిర్మాణంకు రూ, 1.70కోట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
























వెక్కిరిస్తున్న శిలాఫలకాలు

- నిధులు రాక అసంపూర్తిగా భవనాల నిర్మాణాలు
- సమస్యలు పరిష్కారం కాక ప్రజల ఇబ్బందులు
- చొరవ చూపని ఎమ్మెల్యే, అధికారులు
- ఆందోళనలకు సిద్ధమవుతున్న స్థానికులు


మేడిగడ్డ-శంకర్ కొండ వాగుపై నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

ఆమనగల్లు, ఆగస్టు 4: ఆమనగల్లు మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలాయి. కొన్నిచోట్ల శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి. మరికొన్ని చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.నిధులు రాక భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. గతంలో చేపట్టిన పనులను పూర్తిచేయించేందుకు ఎమ్మెల్యే, ఎంపీ, ఉన్నతాధికారులు చొరవచూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పనులకు నిధులు విడుదల కాక కాంట్రాక్టర్లు వదిలేసినట్లు సమాచారం. మరికొన్ని పనులు శంకుస్థాపనలతోనే ఆగిపోయాయి. చేపట్టిన అన్న పనులకు నిధులు విడుదల చేయించి పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా కళాశాల భవన నిర్మాణ పనులు

ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 23ఏళ్లుగా బాలుర పాఠశాలలో జూనియర్ కాలేజీని నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణానికి 2004లో అప్పటి ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో మాడ్గుల రోడ్డులో 9.15ఎకరాల భూమిని కొన్నారు. భవన నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు కావడంతో అప్పటి కేంద్ర మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే స్థల విషయంలో తలెత్తిన వివాదాలతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 2022లో అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అసెంబ్లీలో ఈ వివాదంపై లేవనెత్తగా అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి స్థల సమస్యను పరిష్కరించి నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేయించారు. పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా భూమిపై తమకు హక్కులు ఉన్నాయని కొందరు దళితులు కోర్టును ఆశ్రయించగా పనులు మళ్లీ నిలిచిపోయాయి. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరైనా భవనాల్లేవు. కేజీబీవీకి ప్రహరీ లేక విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ బాలుర పాఠశాలకు భవనం లేదు. వినియోగంలో లేని బీసీ హాస్టల్ భవనంలో ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిలిచాయి. 2021లో ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి రూ.4.5కోట్లు మంజూరు చేసింది. 2021 నవంబరు 8న మార్కెట్ నిర్మాణానికి అప్పటి మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. గతేడాది పనులు ప్రారంభించి స్లాబ్ వరకు చేపట్టారు. కాగా నిధులు విడుదల కాక నాలుగు నెలల క్రితం కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు.

శంకుస్థాపనలకే పరిమితమైన బీటీ రోడ్ల పనులు

పలు గ్రామలకు బీటీ రోడ్ల నిర్మాణాలు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి. జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి రోడ్డుకు రూ.2.12కోట్లు, సింగంపల్లి-ఆకుతోటపల్లి రోడ్డుకు రూ.3 కోట్లు, పోలెపల్లి గేటు-మంగళికుంట తండా రోడ్డుకు రూ.60 లక్షలు, పోలెపల్లి-కొత్తకుంట తండాకు రోడ్డుకు రూ.1.5కోట్లు మంజూరయ్యాయి. పనులకు 2023 ఆగస్టు 29న అప్పటి ఎమ్మెల్యే జైపాల్ శంకుస్థాపనలు చేశారు. వీటిలో ఒక్క పనీ పనిప్రారంభించలేదు. మండల పరిషత్ వద్ద దుకాణ సముదాయ నిర్మాణం ప్రతిపాదనల్లోనే ఉంది. చెన్నంపల్లి పంచాయతీ భవన నిర్మాణం మొదలు కాలేదు. మహిళా సమాఖ్య భవనాలూ నిర్మాణం కాలేదు.

వంతెన నిర్మాణానికి వీడని గ్రహణం

మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి మూడేళ్ల క్రితం కేంద్రం ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రూ.3.1కోట్లు మంజూరు చేసింది. 2022 సెప్టెంబరు 6న పనులకు అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పిల్లర్లకు గోతులు తవ్వగా నీరు వచ్చిందని వదిలేశారు. 2023 జూన్ 11న అప్పటి కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ వంతెన ప్రదేశాన్ని సందర్శించి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో 3నెలలకు పనులు ప్రారంభించారు. పిల్లర్ల వేశారు. చేపట్టిన పనులకు నిధులు విడుదల కాక నాలుగు నెలల క్రితం కాంట్రాక్టర్ ప ను లు నిలిపివేశారు. రాంనుంతల-పెద్ద తండా మధ్య వాగు పై వంతెనకు రెండు వైపుల రోడ్డు నిర్మించాల్సి ఉంది. మంగళపల్లి-చెన్నారం వాగుపై బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఆమనగల్లు అభివృద్ధిపై సర్కారు వివక్ష



ఆమనగల్లు మండల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షత చూపుతోంది. ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఓట్లు రాలేదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమస్యలను పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అన్ని పనులూ నిలిచిపోయాయి. ఆయా పనులకు నిధులు విడుదల చేయించి పూర్తి చేయకపోతే ప్రజా పోరాటాలు తప్పవు.

- అనురాధపత్యానాయక్,మాజీ జడ్పీటీసీ, ఆమనగల్లు

బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి



మేడిగడ్డ-శంకర్ కొండ వాగుపై బ్రిడ్జి పనులను మూడేళ్ల క్రితం ప్రారంభించినా పూర్తికాలేదు. పిల్లర్ల వద్దే నిలిపేశారు. పనులు చేయించేందుకు ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి. వాగు సాగితే రెండు తండాల రాకపోకలు నిలిచిపోతాయి. వెంటనే పనులు చేపట్టాలి.

- అమర్‌సింగ్, మాజీ సర్పంచ్, మేడిగడ్డ తండా

ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి

జూనియర్ కళాశాల స్థల వివాదాన్ని త్వరగా పరిష్కరించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం, పాలక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. **- జల్లెల్ల శివ, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు**

నేడు తూంకుంటలో స్వచ్ఛదనం-పచ్చదనం


కరపత్రాలను విడుదల చేస్తున్న కమిషనర్, సిబ్బంది

శామీర్‌పేట, ఆగస్టు 4: తూంకుంట మునిసిపాలిటీలో సోమవారం చైర్మన్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమ ర్యాలీని విజయవంతం చేయాలని కమిషనర్ వెంకటగోపాల్ కోరారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంపై సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములై ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ గౌతమ్, అధికారి ప్రశాంత్ జీవన్‌పాటిల్, అదనపు కలెక్టర్ రాధికగుప్తా, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రానున్నారని తెలిపారు. తూంకుంట మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా, యువజన సంఘాల సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మొదట మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమంపై కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తూ అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమ కరపత్రాలను వెంకటగోపాల్, సిబ్బంది విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో సంగమేశ్వరాలయం కిటకిట

తాండూరు, ఆగస్టు 4: అమావాస్య కావడంతో ఆదివారం మండల పరిధిలోని సంగెంకుర్దు సంగమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య నాడు సంగమేశ్వరున్ని దర్శించి పూజలు చేస్తే సకల పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు. యాలాల మండల ప్రజలే కాకుండా తాండూరు నుంచి పెద్దఎత్తున భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. భక్తులకు దైవ దర్శనం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.



సంగమేశ్వర స్వామిని దర్శించుకుంటున్నభక్తులు


శివలింగానికి పూజలు చేస్తున్న పూజారులు

వాయ్‌నాడు వరద బాధితులకు అండగా ఉందాం

బొంరాస్‌పేట్, ఆగస్టు4:కేరళలోని వాయ్‌నాడు వరద బాధితులకు అండగా ఉందామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య అన్నారు. ఆదివారం దుద్యాలలో ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. కేరళలోని వాయ్‌నాడు జిల్లాలో వరదలతో కొండ చరియలు విరిగిపడి తీవ్ర నష్టం జరిగిందన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

కందుకూరు, ఆగస్టు 4: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమాన్ని తాను మొట్టమొదట కందుకూరు మండలం దాసర్లపల్లి నుంచే ప్రారంభించానని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనను కలిసిన పార్టీ నాయకులతో అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు త్వరలో మరోసారి కందుకూరు మండలం నుంచే పోరాటాన్ని ప్రారంభిస్తానన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల బీఆర్ఎస్ నాయకులు ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో కేసీఆర్‌ను కలిశారు. కేసీఆర్ వారితో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, పదేళ్లలో రాష్ట్రాన్ని తాము ఎంతో అభివృద్ధి చేశామని, కాంగ్రెస్, బీజేపీ నాయకుల కుట్రలను తిప్పికొట్టేందుకు కృషిచేయాలని సూచించారు. ఇటీవల అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు మాట్లాడిన తీరు బాధాకరమన్నారు. మంత్రులుగా సబితారెడ్డి, సునీతారెడ్డి ప్రజలకు ఎనలేని సేవలందించిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు విస్మరించి మాట్లాడడం సరికాదన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.జయేందర్, నియోజకవర్గ నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, దేవీలాల్, ప్రభాకర్‌రెడ్డి, రాములు, వెంకటేష్, ఆనంద్, దర్శన్‌రెడ్డి, జి.గోపాల్‌రెడ్డి, బి.జ్యోతిచంద్రశేఖర్, భూపాల్‌రెడ్డి ఉన్నారు.


కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

టీజీవో జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రామారావు



టీజీవో జిల్లా నూతన కమిటీ సభ్యులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) రంగారెడ్డి జిల్లా ఎన్నికలు జరిగాయి. ఆదివారం ఖైరతాబాద్‌లోని జడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలకు టీజీవో సెంట్రల్ కమిటీ ప్రతినిధి ఆర్.శ్రీనివాసమూర్తి, ఎలక్షన్ ఆఫీసర్‌గా నల్లగొండ జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎమ్.శ్రీనివాసులు హాజరయ్యారు. టీజీవో జిల్లా అధ్యకుడిగా డాక్టర్ కె.రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్లుగా వెంకటేశ్, సీసీ.వెంకటేశం, వైస్‌ప్రెసిడెంట్లు ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.అలివేలు మంగ, లేడీ వింగ్ వైస్‌ప్రెసిడెంట్‌గా ఎన్.రేవతి దేదీప్య, సెక్రటరీ శ్రీనేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా కె.అనిత, పి.లక్ష్మణస్వామిలను ఎన్నుకున్నారు. మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ జి.మహేశ్వరి, ట్రెజరర్ ఎన్.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పి.యుగంధర్‌రెడ్డి, పబ్లిసిటీ సెక్రెటరీ రవీందర్, ఆఫీస్ సెక్రెటరీ డి.సుజాత ఎన్నికయ్యారు. కల్చరల్ సెక్రటరీ ఎ.వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ సెక్రెటరీ శివకుమార్, కార్యవర్గ సభ్యులుగా కె.నరేందర్, శ్రవణ్ కుమార్, ఎ.నరేందర్‌గౌడ్, బి.సుజాత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సెక్రెటరీ సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు, జేఎస్ పరమేశ్వర్‌రెడ్డి, లేడీ రెప్రజెంటేటివ్ దీపారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాటుపడుతాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



అనంతగిరిపల్లిలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఆగస్టు 4 : పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అధికారులతో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం వికారాబాద్ పట్టణంలోని చెంచుపల్లి, లక్ష్మీనగర్ తండాలో మునిసిపల్ దర్బార్ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కూల్ బిల్డింగ్‌లు సైతం శిథిలావస్థకు చేరాయన్నారు. సమస్యలను మునిసిపల్ కమిషనర్, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా పాటుపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పట్టణ ఇన్‌చార్జి రాజేందర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, శిరీష, అమర్‌నాథ్, సుచరితరెడ్డి, మధులత, రాములు పాల్గొన్నారు.

ప్రజాసేవ చేయాలనుకునే వారికి బీజేపీ ఆహ్వానం

మేడ్చల్ టౌన్. ఆగస్టు 4 : ప్రజాసేవ చేయాలనుకుంటున్న ప్రతీ ఒక్కరిని తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మేడ్చల్ మున్సిపాలిటీ 3వ, వార్డుకు చెందిన పలువురు యువకులు రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎంపీ కండువా కప్పి స్వాగతం పలికారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై చాలా మంది తమ పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రజాసేవ చేసేవారికి బీజేపీ ఒక మంచి వేదికన్నారు. సిద్ధాంతాలుగల పార్టీగా నేడు ప్రపంచ వ్యాప్తంగా తమ పార్టీకి గుర్తింపు ఉందన్నారు. పార్టీలో చేరుతున్న వారు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని, కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని ఈటల అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎంపీ ఈటల రాజేందర్

అమెరికా పర్యటనలో సీఎం వెంట ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి, అగస్టు 4: సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారు. ఆదివారం అక్కడి పారిశ్రామికవేత్తలతో సీఎంతోపాటు, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎన్నారైలు నేతలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా పర్యటన పూర్తి చేసుకుని ఈ నెల 14న తిరిగి రానున్నారు.



ఖుషీ ఖుషీగా ఫ్రెండ్‌షిప్ డే!

మేడ్చల్ టౌన్, ఆగస్టు 4: మేడ్చల్‌లో ఆదివారం ఫ్రెండ్ షిప్ డేను చిన్నాపెద్ద సంతోషంగా జరుపుకున్నారు. మిత్రులకు ఫ్రెండ్ షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు వాట్సాప్, ట్విటర్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహితులకు విషెస్ తెలిపారు. చిన్నారులు చేతులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకొని సంబరాలు చేసుకున్నారు. ఫ్రెండ్ షిప్ డేను పురస్కరించుకుని పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని జరుపుకున్నారు.


ఫ్రెండ్‌షిప్ బ్యాండులు కట్టుకుంటున్న పిల్లలు

మంత్రులపై ఆశలు

- నేడు తాండూరు నియోజకవర్గంలో పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల పర్యటన
- ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో మంత్రుల తొలి పర్యటన

తాండూరు, ఆగస్టు 4 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత తాండూరు నియోజకవర్గంలో తొలిసారి ఇద్దరు రాష్ట్ర మంత్రుల పర్యటనలు ఖరారయ్యాయి. నియోజకవర్గానికి ఇద్దరు మంత్రులు వస్తుండడంతో ఈ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతో పాటు కొత్త పనులు ప్రారంభిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. సోమవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వారు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

రోడ్డు అప్‌గ్రేడేషన్..

మన్నేగూడ-వికారాబాద్-తాండూరు-జహీరాబాద్-బీదర్ రోడ్డు అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రోడ్డు 133.9కిలో మీటర్లు నిర్మాణం చేసి హైవేకు లింక్ చేయాలనే ప్రతిపాదనలున్నాయి. ఈ రోడ్డు పూర్తయితే అటు కర్ణాటక, ఇటు సంగారెడ్డి జిల్లాలకు వెళ్లేందుకు అక్కడి వారు ముంబాయి, పుణె, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే వారికి ఖర్చు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. తాండూరు-వికారాబాద్ రోడ్డు నిర్మాణానికి రివైజ్డ్ అంచనాలు రూ.100కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు వారం క్రితం ప్రతిపాదనలు పంపించారు. ఈ రోడ్డు 40 కిలో మీటర్ల దూరం వరకు వేస్తారు.

సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు

వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్న మైన్స్ ఏడీ కార్యాలయాలం, సబ్ రిజిస్ట్రార్, ఎక్సైజ్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ స్థలాలున్నా దశాబ్దాలుగా సొంత భవనాలు నిర్మించక ఇబ్బందులు పడుతున్నారు. తాండూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ఐసీడీఎస్ కార్యాలయం సైతం అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ప్రజలకు నిత్యం ఉపయోగపడే ఈ కార్యాలయాలకు సొంత భవనాలను మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే జూనియర్ కళాశాల ఎదురుగా వెంకటేశ్వర కాలనీలో నిర్మిస్తున్న ప్రభుత్వ గెస్ట్‌హౌస్ పనులు నిలిచిపోయాయి. అలాగే రాష్ట్ర కోటాలో వచ్చే ఇందిరమ్మ ఇండ్లతో పాటు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఈ ప్రాంతానికి అదనంగా మరిన్ని ఇళ్లను మంజూరు చేయాలని ప్రజలు ఆశిస్తున్నారు. తండాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతానికి అదనంగా వెయ్యి ఇళ్లను మంజూరు చేయాలని కోరుతున్నారు.

నేడు స్పీకర్, మంత్రుల పర్యటన

తాండూరు: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటిస్తారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. తాండూరులో ముర్షద్ దర్గా జంక్షన్ వద్ద గొల్ల చెరువు డ్రెయిన్ నిర్మాణానికి, దర్గా జంక్షన్-కింగ్ ప్యాలెస్ వరకు సీసీ రోడ్డు,సెంట్రల్ లైటింగ్ పనులకు, అలాగే నీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

జినుగుర్తిలో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం



తాండూరు రూరల్: మండలం పరిధి జినుగుర్తిలో రూ.2.4కోట్లతో నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను సోమవారం మంత్రులు ప్రారంభించ నున్నారు. ఆదివారం ట్రాన్స్‌కో మండల ఏఈ కె.వెంకట్ నాయుడు మాట్లాడుతూ.. ఉదయం 11గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామ న్నారు. మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభిస్తారన్నారు. ఈ సబ్‌స్టేషన్‌తో జినుగుర్తి, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లి తండా, జినుగుర్తితండా, ఉద్దండాపూర్, గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డ తండా, అల్లాపూర్, సిరిగిరిపేట్ గ్రామాల పరిధిలో విద్యుత్ అంతరాయానికి ఇబ్బందులు తొలగుతాయని ఏఈ తెలిపారు.

వికారాబాద్ నియోజకవర్గంలో...

వికారాబాద్: వికారాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు వికారాబాద్‌లో 4సూటెడ్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణ శంకుస్థాపన, ఆలంపల్లి నుంచి రాళ్ల చిట్టంపల్లి వరకు డబుల్ రోడ్డు, మర్పల్లి నుంచి కోట్‌పల్లి వరకు రోడ్డు, వికారాబాద్-తాండూరు డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రావాల్సి ఉన్నా ఆయన పర్యాటన రద్దయినట్లు తెలిసింది.

వెంచర్లలో అక్రమాలపై విచారించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్, ఆగస్టు 4 : షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని రియల్ ఎస్టేట్ వెంచర్లపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు బాబర్‌ఖాన్, పి.రఘు మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని.. అడ్డగోలుగా వెంచర్లకు అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికీ కొన్ని వెంచర్లు ప్రభుత్వ భూములు ఉండటంతో పాటు, కనీసం మున్సిపాల్టీలు, గ్రామపంచాయతీలకు వదలాల్సిన 10 శాతం భూములను కూడా అమ్ముకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు సైతం రియల్ వ్యాపారులతో కుమ్మక్కై ఎకరాకు ఇంత అంటూ కమీషన్లు తీసుకుని అనుమతులు జారీ చేశారని ఆరోపించారు. వారితో పాటు ప్రజాపతినిధులకు కూడా కమీషన్‌లు చెల్లించడంతో రియల్ వ్యాపారుల అక్రమాలపై ప్రశ్నించేవారే లేకుండా పోయారని అన్నారు. అదేవిధంగా సాగులో ఉన్న వ్యవసాయ భూములను నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్పు చేయించుకుని పెద్దఎత్తున వెంచర్లను నెలకొల్పారని వెల్లడించారు. షాద్‌నగర్ రియల్ వెంచర్లపై విచరణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శశాంకతో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతి పత్రం అందజేశామని వారు తెలిపారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 4 : పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వైద్య చికిత్సలకు వరంగా నిలుస్తుందని చెప్పారు. వెల్దండ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన నేనావత్ తారాసింగ్ నాయక్ అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చులను ప్రభుత్వ పరంగా ఇప్పించాలని బాధితుడు శ్రీనివాస్‌రెడ్డిని అభ్యర్థించారు. దాంతో మంజూరుచేసిన రూ.16,500వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం ఆమనగల్లు పట్టణంలో బాధితుడికి అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద అన్నిరకాల వైద్య చికిత్సలు చేర్చి పేదలను ఆదుకోవాలని అన్నారు. సొసైటీ డైరెక్టర్ నాగులు నాయక్, తలకొండ పల్లి బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆమనగల్లు మున్సిపల్ బీఆర్‌ఎస్ నాయకులు చలిచీమల సతీష్, సుమన్‌నాయక్, గురవయ్య, మండె శ్రీను, బర్కం గణేష్ తదితరులున్నారు.

తెలుగు వర్సిటీకి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలి

- రాష్ట్ర వీరశైవ జంగమ సమాజం అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి

శంకర్‌పల్లి, ఆగస్టు 4: తెలుగు విశ్వవిద్యాలయానికి పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని రాష్ట్ర వీరశైవ జంగమ సమాజం అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టాలని ఆలోచించడం సముచితం కాదన్నారు. తెలంగాణ ఆదికవి అయిన పాల్కురికి సోమనాథుడి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గల విశ్వవిద్యాలయానికి ఆదికవి నన్నయ్య, కడపలోని విశ్వవిద్యాలయానికి వేమన పేరు పెట్టారని, అలాగే తెలంగాణలో సైతం ఆదికవి అయిన పాల్కురికి సోమనాథుడి పేరును పెడితే సముచితంగా ఉంటుందని అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును మరో విశ్వవిద్యాలయానికి పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పాల్కురికి సోమనాథుడు తెలుగు భాషకు ఎంతో సేవచేసి, గ్రంథాలను రచించారని గుర్తుచేశారు.

ఆమనగల్లులో 19న గాయత్రీ ధారణ యజ్ఞం

ఆమనగల్లు, ఆగస్టు 4: పట్టణంలోని భక్త మార్కండేయ దేవాలయంలో ఈనెల 19న 38వ నూలు పూర్ణిమ గాయత్రీ ధారణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఎంగళి బాలకృష్ణ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తుల రాక నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. యజ్ఞం నిర్వహణపై సన్నాహక బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్వాహకులు, పద్మశాలి సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూలు పూర్ణిమ గాయత్రి యజ్ఞంనకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు ఏర్పాట్ల నిర్వహణ, వసతుల కల్పనపై సమావేశంలో చర్చించారు. పద్మశాలి సంఘం నాయకులు అప్పం శ్రీను, శివలింగం, వాసు, పాలాది శ్రీను, దొంతు ఈశ్వరయ్య, ఆంజనేయులు, సత్యరాములు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి

తలకొండపల్లి, ఆగస్టు 4: అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద పక్కా ఇళ్లు నిర్మించి సొంతింటి కలను సాకారం చేయాలని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయాలకు చోటివ్వకూడదని కోరారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పలువురు నిరుపేదల ఇళ్ల నిర్మాణాలు ఆర్థిక ఇబ్బందులతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దాంతో పనుల పూర్తికి సహకారం అందించాలని ఉప్పల వెంకటేష్‌ను అభ్యర్థించారు. స్పందించిన వెంకటేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇళ్ల నిర్మాణంలో భాగంగా వారికి అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చి ఆదివారం అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 2,500 ఇళ్ల నిర్మాణానికి చేయూతనందించినట్లు చెప్పారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



చేవెళ్లలో మొక్కలు నాటుతున్న సేవ సమితి సభ్యులు

చేవెళ్ల, ఆగస్టు 4 : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సత్యసాయి సేవా సమితి తెలంగాణ మహిళా యూత్ కోఆర్డినేటర్ నాగజ్యోతి తెలిపారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటి స్వామివారి ఆశీస్సులు పొందవలసిందిగా ప్రార్థించారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని ఆమె తెలిపారు. విరివిగా చెట్లను పెంచడం వలన కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అంజనేయులు, చేవెళ్ల సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామగౌడ్, యూత్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, సభ్యులు భాస్కర్, నిర్మల, శశిరేఖ, ప్రభావతి, స్వరూప, మధుసూదన్, పెంటారెడ్డి, మాణిక్యరెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు కృషి

- నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి



మల్లు రవికి వినతిపత్రం అందజేస్తున్న వస్పుల జంగయ్య

ఆమనగల్లు, ఆగస్టు 4: ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వస్పుల జంగయ్య ఆధ్వర్యంలో ఆదివారం మల్లు రవిని కలివారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు కలిపి ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల పోలీస్ స్టేషన్ రాచకొండ కమిషనరేట్ పరిధిలో, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల పోలీసు స్టేషన్లు సైబరాబాద్ పరిధిలో ఉన్నాయని, మాడ్గుల స్టేషన్‌ను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి మార్చి నాలుగు పోలీసు స్టేషన్లను కలిపి ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. దాంతో స్పందించిన మల్లు రవి ఉన్నతాధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ మల్లు రవిని కలిసిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, నాయకులు పాలాది శ్రీను తదితరులు ఉన్నారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు, ఆగస్టు 4: ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి ప్రాణిని కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని, రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలని మిషన్ భగీరథ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డిలు అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డితో కలిసి ఉప్పల వెంకటేశ్ ప్రారంభించారు. శిబిరంలో 77 మంది యువతీయువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేయడానికి యువతి, యువకులు స్వచ్ఛందంగా ముందుకురావాలని వారు పిలుపునిచ్చారు. రక్త, అవయవదానాలపై ప్రజలు అపోహలు వీడాలని వెంకటేశ్, లక్ష్మారెడ్డిలు సూచించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి యువతీయువకుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రక్తాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చిన యువతీయువకులను అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలను ఉప్పల వెంకటేశ్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ రమేశ్, పీఆర్వో పాష, సభ్యులు పి. వెంకట్‌రెడ్డి, రక్తదాత అంజిరెడ్డి, ఉప్పల ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



మోదీ, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

షాబాద్, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, అంబేడ్కర్ యువజన సంఘం మల్లగల్ల సతీష్ అన్నారు. ఆదివారం షాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అణగారిన వర్గాల దశాబ్దాల పోరాటానికి న్యాయం జరిగిందని, ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ కల నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్కు విశ్వం, దర్శనాల కృష్ణ, జడల రాజేందర్‌గౌడ్, లంబడి కిరణ్, శ్రీశైలం, బాల్‌రాజ్, విజయ్‌కుమార్, రాములు, రవి, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ డీఐ రాంరెడ్డి సీపీ కార్యాలయానికి అటాచ్

- ఉత్తర్వులు జారీ చేసిన పోలీస్ కమిషనర్



షాద్‌నగర్, ఆగస్టు 4: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ)గా విధులు నిర్వహిస్తున్న రాంరెడ్డిని సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ ఆదివారం రాత్రి కమిషనర్ ఆఫ్ పోలీస్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. డీఐ రాంరెడ్డిపై వచ్చిన ఆరోపణలపై కమిషనర్ స్పందిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. డీఐపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని షాద్‌నగర్ ఏసీపీ రంగాస్వామిని ఆదేశించారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పవు



విష్ణువర్థన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న చేవెళ్ల డాక్యుమెంట్ రైటర్స్

చేవెళ్ల, ఆగస్టు 4 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పవని చేవెళ్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా చేవెళ్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన విష్ణువర్ధన్ గౌడ్ ఇటీవల బదిలీపై సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో వీరయ్య గార్డెన్‌లో బదిలీ అయిన అధికారితో పాటు నూతనంగా బాధ్యతలు తీసుకున్న చేవెళ్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌కు కార్యాలయ ఉద్యోగులకు చేవెళ్ల డాక్యుమెంట్ రైటర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ పని చేసినా ప్రజల మన్ననలు పొందడంతోనే సరైన గుర్తింపు ఉంటుందన్నారు. ఉద్యోగులకు బదిలీలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ రాజేంద్రకుమార్, కార్యాలయం అధికారులు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్స్ జి. నర్సింహరెడ్డి, దయాకర్‌రెడ్డి, జె. మల్లేష్, ప్రభు, గోపాల్, శ్రీరామ్, శివకుమార్, రమేశ్, జగదీశ్వర్ రెడ్డి, రాములు, నర్సింలు, తదితరులు ఉన్నారు.

అనాథ కుటుంబానికి ఆర్థిక సాయం



రూ.లక్ష చెక్కును అందిస్తున్న పల్లె బ్రదర్స్ బాలీశ్వర్, ఆనంద్ కుమార్

కేశంపేట, ఆగస్టు 4: తల్లితండ్రులను కోల్పోయి.. నిండా 7 సంవత్సరాలు లేని ముగ్గురు పిల్లల కుటుంబ పరిస్థితిని చూసి చలించిన మండలంలోని కొండారెడ్డిపల్లికి చెందిన పల్లె బ్రదర్స్‌గా పిలువబడే పల్లె ఆనంద్ కుమార్, పల్లె బాలీశ్వర్‌లు ఆర్థిక చేయూతనిచ్చారు. కొండారెడ్డిపల్లికి చెందిన బైండ్ల నందు, నందిని, శ్రీవాణి తల్లితండ్రులను కోల్పోయారు. తమ మేనత్త దగ్గర ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పల్లె బ్రదర్స్ ఆదివారం రూ.లక్ష చెక్కును వారికి అందజేశారు. పిల్లల పేర బ్యాంకులో డిపాజిట్ చేసి భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని పిల్లల మేనత్తను కోరారు. కాగా, ఆ కుటుంబానికి గతంలో పల్లె బ్రదర్స్ ఇల్లు కట్టించి ఇవ్వడం గమనార్హం. ఈ కార్యక్రమంలో పామ్ విజేందర్‌రెడ్డి, సూరం శ్రీనివాస్, పెబ్బె శివకుమార్, బుర్రి మల్లేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, మల్లేష్, రమేష్, శ్రీశైలం, శ్రీను, శ్రీకాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

కేశంపేట : తమతో కలిసి చదువుకున్న మిత్రుడు చనిపోవడంతో అతడి కుటుంబానికి అండగా నిలిచారు బాల్యమిత్రులు. కొనాయపల్లి గ్రామానికి చెందిన సొప్పరి రవీందర్ గతేడాది గుండెపోటుతో మృతిచెందాడు. రవీందర్‌తో పాటు చదువుకున్న 1995-1996 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం అతడి కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేలు అందించారు. కుటుంబ అవసరాలకు డబ్బులు ఉపయోగించుకోవాలని వారిని కోరారు. కార్యక్రమంలో పోచారం జగన్ రెడ్డి, యాదగిరిచారి, రమేష్ గౌడ్, సొప్పరి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి : మండల పరిధిలోని రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంఘాయిపల్లి గ్రామానికి చెందిన ఆరికట్ల బాలరామ్ అనారోగ్యంతో మృతి చెందాదు. మృతదేహాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి మృతుడి కుటుంబానికి రూ.3వేలు అందజేశారు. రాములు, వెంకటయ్య, చెన్నకేశవులు, పబ్బు శ్రీను, వినోద్, సాయి, తదితరులు ఉన్నారు.

ఘనంగా అ'పూర్వ' సమ్మేళనాలు



షాద్‌నగర్ రూరల్ : సమ్మేళనంలో విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్/చేవెళ్ల/షాబాద్, ఆగస్టు 4: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో 1987-88లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమైనారు. పాఠశాల ప్రారంభించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కుటుంబ సభ్యులతో సమావేశమైన నాటి విద్యార్థులు ఆనాటి తమ గురువులైన మదన్‌మోహన్‌రెడ్డి, శివ నాగయ్య, జగపతిరావు, రాములు, పుల్లయ్య, వీరభద్రప్ప, లక్ష్మారెడ్డిలను సన్మానించారు. అలాగే స్నేహితుల దినోత్సవంగా సందర్భంగా ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్వవిద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1997- 98 బ్యాచ్ విద్యార్థులంతా పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. షాబాద్ మండలం తాళ్లపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 1996-97 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు నాగర్‌గూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకొని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : దేవునిఎర్రవల్లి పాఠశాలలో..



షాబాద్ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- ఈనెల 2న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు



సామల మణికంఠ(ఫైల్)

ఆమనగల్లు, ఆగస్టు 4: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఆమనగల్లు పట్టణానికి చెందిన సామల మణికంఠ(20) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు.. ఆమనగల్లు పట్టణానికి చెందిన సామల హరిప్రసాద్ కుమారుడు మణికంఠ ఈనెల 2న సాయంత్రం ఆమనగల్లు నుంచి బైక్‌పై విఠాయిపల్లి వైపు వెళ్తున్నాడు. పట్టణ సమీపంలోని కాటన్‌మిల్ ఎదుట గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. దాంతో మణికంఠ తీవ్రంగా గాయపడగా స్థానికులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మణికంఠ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- తప్పిన పెను ప్రమాదం



ప్రమాద స్థలంలో కారు.. నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మొయినాబాద్, ఆగస్టు 4 : కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగిపోయింది. ఈ సంఘటన మండల పరిధిలోని అమ్డాపూర్ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన స్కోడా కారు షోరూంలో పని చేసే ముగ్గురు వ్యక్తులు కారులో శనివారం రాత్రి మండలంలోని అమ్డాపూర్ వైపు అతివేగంగా వెళుతున్నారు. ఈక్రమంలో కాశీంబౌలి గేటు వద్ద మూల మలుపుపై కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దాంతో స్తంభం నేలకొరిగింది. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, ఈ ప్రమాదనికి సంబంధించి ఎవరు కూడా ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్,ఆగస్టు 4 : సీఎం సహాయనిధి పేదలకు వరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీకి చెందిన గోపిడి పాల్‌రెడ్డికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన నివాసంలో ఆదివారం అందజేశారు. ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీ చెందిన గోపిడి లక్ష్మమ్మ ఇటీవల తీవ్రంగా గాయపడింది. ఈ మేరకు వైద్యం చేయించుకోవడానికి సహాయం చేయాలని సీఎం పేషీకి ఆర్జీ పెట్టుకుంది. దీంతో ఆమెకు సీఎం సహాయ నిధికింద రూ.23వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బాధితురాలి కొడుకు పాల్‌రెడ్డికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, దూడల వెంకటేశ్‌గౌడ్, ఎల్గని సురేష్‌గౌడ్, బొల్లు సంజయ్, బంటి, సుదర్శన్‌గౌడ్, రామకృష్ణమహేశ్, ఆవుల దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ నాయక్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు



మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చుతున్న జైపాల్

ఆమనగల్లు, ఆగస్టు 4 : రమేష్‌నాయక్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి, గిరిజన జాతికి తీరని లోటని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాలను బీఆర్‌ఎస్ పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి గ్రామ సమీపంలో కారు-ఆటో ఢీకొన్న ఘటనలో దుర్మరణం చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బాణావత్ రమేష్‌నాయక్ మృతదేహాన్ని ఆదివారం పులిగోనిపల్లి తండాలోని ఆయన నివాసంలో జైపాల్‌యాదవ్, గోలి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీకి రమేష్ అందించిన సేవలను కొనియాడారు. బీఆర్‌ఎస్ పార్టీ తరపున రమేష్ కుటుంబానికి రూ.35వేలు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీపరంగా అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో మాజీ జెడ్పీటీసీలు దశరథనాయక్, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, అనురాధ, సత్యనాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, నాయకులు యాదయ్య, నిరంజన్, గుత్తిబాలస్వామి, భాస్కర్‌రావు, తదితరులు రమేష్‌నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు.

ఎయిర్‌పోర్టు బావర్చి రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- కిచెన్ పరిసరాలు శుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 4 : మున్సిపల్ పరిధిలోని బస్టాండ్‌లో ఉన్న ఎయిర్‌పోర్టు బావర్చి రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్‌లో పని చేస్తున్న సిబ్బందికి మెడికల్ సర్టిఫికెట్లు లేవని అధికారులు గుర్తించారు. అలాగే కిచెన్ పరిసరాలు శుభ్రంగా లేవని హోటల్ యాజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా పలుమార్లు ఈ రెస్టారెంట్‌పై దాడులు నిర్వహించారు. అయినా తీరు మారడంలేదని అధికారులు మండిపడ్డారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరిగితే భారీ జరిమానాతో పాటు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఫ్రిజ్‌లో స్టోర్ చేసిన చికెన్, బ్రెడ్, బన్నులపై లేబుల్స్ లేవన్నారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి హానికరం చేసే హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రవీందర్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. పథకాల అమలులో తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఆదివారం పలువురు యువజన కాంగ్రెస్ నాయకులతో శ్రీనివాస్‌గౌడ్ సమావేశమయ్యారు. కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న తాళ్ల రవీందర్‌గౌడ్ శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల మేలు, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోమారు కాంగ్రెస్ సత్తా చాటాలని పిలుపునిచ్చారు.